



# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

హనుమకొండ

శుక్రవారం 11 అక్టోబరు 2024 | 7





# పోయిరా బతుకమ్మా.. పోయిరావమ్మా

**'సద్దుల' సంబురంతో ముగిసిన తొమ్మిది రోజుల పూల పండుగ**



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు



పద్మాక్షి గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను కీర్తిస్తూ తొమ్మిదిరోజుల పాటు జరుపుకొన్న పూల పండుగ గురువారం జరిగిన సద్దుల వేడుకతో ముగిసింది. ఆడపడచుల ఆటపాటలతో గౌరమ్మ మురిసిపోయింది. తెలంగాణ సంస్కృతి, పల్లె జీవన విధానాన్ని చాటి చెప్పేలా వేలాది మంది మహిళలు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఆశ్వీయుజ శుద్ధ అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ఒక్కేసి పువ్వేసి చందమామ... ఒక్క జాము అయే చందమామా... అంటూ ఆడిపాడిన అతివలు.. తొమ్మిదవ రోజు ఆశ్వయుజ శుద్ధ సప్తమి (దుర్గాష్టమి)న పోయిరా బతుకమ్మ.. పోయిరావమ్మా అంటూ నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు. ఉదయం నుంచే మహిళలు ఎంతో నిష్ఠతో వెదురు బుట్టలు, వెండి, స్టీలు పళ్లాల్లో గుమ్మడి ఆకులను ఉంచి రంగు రంగులు అద్దిన గునుగుపూలు, తంగేడు, ఇతర రంగు రంగుల పూలతో బతుమ్మలను పేర్చారు. ఆ బతుకమ్మల మధ్య పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి సద్దుల బతుకమ్మ.. పెద్ద బతుకమ్మగా పేర్కొంటూ తొలుత ఇళ్లలో పూజలు చేశారు. మలీద ముద్దలు (లడ్డూలు), చింతపండు పులిహోర, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం, పెరగన్నం తదితర వాటితో నైవేద్యం సమర్పించారు. సాయంత్రం పట్టు చీరెలు, నూతన వస్త్రాలను ధరించిన మహిళలు బతుకమ్మలను చేబూని సమీపంలోని చెరువులు, నీటి కుంటల వద్దకు, చెరువులు లేని చోట్ల మైదాన ప్రాంతాలకు, ఆలయాలకు చేరుకున్నారు. దీంతో పట్టణాలు, పల్లెల్లో సరికొత్త శోభ సంతరించుకుంది. బతుకమ్మలను ఒక దగ్గర చేర్చి లయబద్ధంగా అడుగులు వేస్తూ నృత్యాలు చేశారు. బతుకమ్మ పాటలు, కోలాటాలతో సందడి చేశారు. ఆ తర్వాత బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. వెంట తెచ్చుకున్న పిండి పదార్థాలు, నైవేద్యాలను పంచుకున్నారు.

**పలు ప్రాంతాల్లో సంబురాలు..**

వరంగల్ ఉర్సుగుట్ట వద్ద జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. దేశాయిపేటలోని చిన్నవడ్డె పెల్లి చెరువు, వరంగల్ కోటలోని అగర్తల, గుండు చెరువు, కాశిబుగ్గలోని కోటిలింగాల గుడి, పద్మానగర్, గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు,


▸ మిగతా 10వ పేజీలో..


- చివరి రోజు వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది మహిళలు
- సందడిగా మైదానాలు, చెరువుల పరిసరాలు
- నిమజ్జన ప్రాంతాల్లో యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు




## దుర్గామాతగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 10 : వరంగల్ భద్రకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం ఉదయం 4 గంటలకు నిత్య పూజ నిర్వహించారు. అనంతరం అర్చకులు భద్రకాళి అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. సద్దుల బతుకమ్మ, భద్రకాళి అమ్మవారు జన్మోత్సవం దుర్గాష్టమి రోజున అమ్మవారికి రాత్రి కూడా పూజలు నిర్వహిస్తారు. కోటి యోగిని ఘనములతో ఓరుగల్లులో అవతరించిన భద్రకాళి అమ్మవారికి ఉదయం భద్రపీఠ సేవను నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగించారు. అమ్మవారిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓఎస్‌డీ సందీప్ దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రసాద, అన్నప్రసావితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేషుభారతి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, శ్యాంసుందర్, అశోక్ పాల్గొన్నారు.



దుర్గామాత అలంకరణలో భద్రకాళి దేవి





# సర్పంచ్‌లు లేకున్నా గ్రామాల్లో పండుగ ఏర్పాట్లు

- అర్హులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేస్తాం
- ఆ పైన ఉన్న వారికి విడతల వారీగా వర్తింపజేస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



భీమదేవరపల్లి, అక్టోబరు 10: సర్పంచ్ లేకపోయినా అధికారుల సహకారంతో గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లను ఘనంగా చేశామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్, ఈవో పూర్ణచందర్‌తో కలిసి బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య, డీపీవోలు బతుకమ్మ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూశారన్నారు. అనంతరం ముల్కనూర్‌లోని దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఊహించనంత పంటలు పడుతున్నాయన్నారు. ప్రభుత్వానికి బతుకమ్మ ఏర్పాట్లలో మంచి పేరు వస్తుందని సర్పంచ్‌లు లేకున్న ఏర్పాట్లు బాగా చేస్తున్నారని ప్రజలు అంటున్నారన్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకుల కళ్లు మండుతున్నాయన్నారు. రాష్ట్రంలో కవితక్క బతుకమ్మ ఆడకపోయినా ప్రజాపాలనలో మహిళలంతా బతుకమ్మ ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో అర్హులైన రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ప్రాణమని పేర్కొన్నారు. రూ. 2లక్షలు పైన ఉన్నవారికి కూడా విడతల వారీగా రుణమాఫీ చేస్తామని, కానీ ప్రతిపక్షాలు దీన్ని రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ రూ. 2లక్షల రుణాలు ఉన్న వారికి రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అశోక్‌ముఖర్జీ, కొడూరి సరోజన, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఈవో పూర్ణచందర్, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు కొల్లూరి రాజు, ఆదరి రవీందర్, ఊసకోయిల ప్రకాష్, సుదర్శన్‌రెడ్డి, చిట్కూరి రామచంద్రం, ఎదులాపురం సదానందం, గజ్జెల సురేష్, మీస మహేష్, బొల్లంపల్లి ప్రకాష్, గట్టు ప్రభాకర్, బానోత్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.






## హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా జయంతి



జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జయంతిని అభినందిస్తున్న అధికారులు, సిబ్బంది

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా జే.జయంతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారిగా పని చేసిన ఆమె పదోన్నతిపై హనుమకొండ జిల్లాకు వచ్చారు. ఆమెకు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.

## కొత్తగా నియమితులైన టీచర్లు నేడు రిపోర్టు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 : డీఎస్సీ-2024 ద్వారా కొత్తగా ఎంపికై నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులంతా హనుమకొండ జిల్లా డీఈవో కార్యాలయంలో శుక్రవారం రిపోర్టు చేయాల్సిందిగా డీఈవో డి. వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నియామక పత్రాలు పొందిన 169 మంది ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో విధిగా రిపోర్టు చేయాల్సిందిగా ఆమె సూచించారు.


హనుమకొండ పద్మాక్షి గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



# సంబురం 'సద్దుల' పర్వం


చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ గుండు సుధారాణి


హనుమకొండ పద్మాక్షి గుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం


బతుకమ్మ పేరుస్తున్న ఎంపీ కావ్య


బతుకమ్మ పేరుస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ


హనుమకొండ టీఎన్‌జీవోస్ కాలనీలో బతుకమ్మతో వస్తున్న యువతి



# గుట్టుచప్పుడు కాకుండా..

- అనుమతుల్లేకుండా వరంగల్ నగరంలో బాణసంచా తయారీ
- కళ్లుగప్పి పొరుగు జిల్లాల్లోని గోదాములకు తరలింపు
- క్షేత్రస్థాయిలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇదే అదనుగా కొందరు వ్యాపారుల దందా
- ఆరేళ్ల నాటి ఘటనను గుర్తుచేస్తున్న స్థానికులు

వరంగల్ క్రైం, అక్టోబరు 10: దసరా, దీపావళి పండుగలతో పాటు పలు కార్యక్రమాలకు బాణసంచా వినియోగం సర్వసాధారణమైంది. గతంలో తమిళనాడు శివకాశి నుంచి బాణసంచా కొనుగోలు చేసి తీసుకొచ్చి అన్ని అనుమతులతో నగరంలో విక్రయించే వారు. సాధారణ రోజుల్లో అయితే ఒకటి రెండు షాపుల్లో మాత్రమే విక్రయాలు జరిగేవి. రానురాను ఆ పరిస్థితి మారింది. ఏకంగా వరంగల్ నగరంలోనే బాణసంచా తయారీ కేంద్రాలు వెలిశాయని, అది కూడా అనుమతుల్లేకుండా జరుగుతున్నట్టు తెలుస్తోంది. చెన్నై నుంచి ముడిసరుకు తెచ్చుకుని వరంగల్‌లో బాణాసంచా తయారు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా కాశిబుగ్గ సమీపంలోని ఓ ప్రాంతంలో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారని, ఈ వ్యాపారం రుచి మరిగిన ఒకరిద్దరు వ్యక్తులు స్థానిక పోలీసులు, రాజకీయ నేతల అండతో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా జనావాసాల మధ్యే ఏర్పాటు చేశారని సమాచారం. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే స్థానికులు, అక్కడ పనిచేసే వారి పరిస్థితేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయకపోవడం, వీరి వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో తయారీ దారులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రమాదంలో 10 మంది మృతి చెందినా ఆగని దందా

ఆరేళ్ల క్రితం వరంగల్‌లోని బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి పది మంది వరకు మృతి చెందినా నగరంలో దందా ఆగడం లేదనే ప్రచారం సాగుతోంది. దసరా ఉత్సవాలకు అడ్వాన్స్ తీసుకున్న సదరు వ్యాపారులు పెద్దఎత్తున బాణాసంచా తయారీ చేస్తున్నట్టు తెలిసింది. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుగా తయారు చేస్తున్నట్లు సమాచారం. తయారు చేసిన సరుకు పొరుగు జిల్లాలైన జనగామ, కరీంనగర్‌లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల జనగామ గోదాములో జరిగిన ప్రమాదానికి సంబంధించిన సరుకు వరంగల్‌లో తయారు చేసిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. యథేచ్ఛగా తయారు చేస్తున్న వ్యాపారులు వరంగల్‌లోనే కాకుండా ఉత్తర తెలంగాణ జిల్లాలకు సరఫరా చేస్తుంటారని సమాచారం. పొరుగు జిల్లాలకు సరఫరా చేసేంత సరుకు ఇక్కడ తయారు చేస్తున్నారంటే ఆ వ్యాపారం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఏంటని స్థానికులు ఆరేళ్లన నాటి ఘటనను గుర్తుచేసుకుని ఆందోళన చెందుతున్నారు.



### ఈ నిబంధనలు తప్పనిసరి

బాణసంచా తయారు చేయాలన్నా, విక్రయించాలన్నా పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరి. షాపులు గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉండేలా చూసుకోవాలి. దేవాలయాలకు 200 మీటర్ల దూరంలో షాపులు ఉంచాలి. ఆ షాపుల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండకూడదు. ప్రధానంగా జనావాసాలకు దూరంగా తయారీ కేంద్రాలు ఉండాలి.

### అనుమతులు లేకుండా విక్రయాలు

ఇక బాణసంచా విక్రయించాలంటే పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరి. ఇవేవీ లేకుండానే వరంగల్ నగరంలో పలుచోట్ల బాణసంచా విక్రయాలు జరుగుతున్నట్టు తెలిసింది. వరంగల్ బట్టలబజార్‌లో ఒకటి రెండు షాపులకు మాత్రమే అనుమతులుండగా, చాలా షాపుల్లో బాణసంచా విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. వరంగల్ నగరంలోని ఒక ఆలయం సమీపంలో బాణసంచా విక్రయాలు జరుపుతున్నట్టు తెలిసింది. యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నా కట్టడి చేయాల్సిన రెండు శాఖల అధికారులు కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. రూ.కోట్లలో జరుగుతున్న వ్యాపారానికి సం బంధించి వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వరని, కట్టడి చేయాల్సిన అధికారులు తాయిలాలకు అలవాటు పడి వ్యాపారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- ప్రాణాలతో బయటపడిన మనవడు
- వరంగల్ జిల్లా అలంకానిపేటలో విషాదం

నెక్కొండ, అక్టోబరు 10: బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. తాత, మనవడు విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు అప్రమత్తమవడంతో బాలుడు సురక్షితంగా బయటపడగా, తాత మృత్యువాతపడ్డాడు. పండుగ పూట పెనువిషాదం నింపిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చీకటి యాకయ్య (41) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో బతుకమ్మ ఆడుకునేందుకు కుటుంబసభ్యులు గ్రామంలోని ఊర చేరువుకు చేరుకున్నారు. యాకయ్య భార్య, ఇద్దరు కూతుళ్లు బతుకమ్మ ఆడుకుంటుండగా, యాకయ్య పెద్ద కుమార్తె ఏడాది వయసున్న కుమారుడిని ఎత్తుకుని పక్కన ఉండి వేడుకల్ని చూస్తున్నాడు. ఇంతలో వర్షం ప్రారంభం కావడంతో తడవకుండా ఉండేందుకు వడివడిగా వెళ్తున్న క్రమంతో బతుకమ్మ వేడుకలకు అమర్చిన విద్యుత్ కాంతుల వైరు యాకయ్యకు తగిలింది. దీంతో వైరు తెగి కిందపడగా దానిపై యాకయ్య పడడంతో షాక్‌కు గురయ్యాడు. గుర్తించిన గ్రామస్థులు బాలుడిని రక్షించేందుకు యాకయ్య చేతిపై బలంగా రబ్బరు చెప్పుతో కొట్టారు. దీంతో బాలుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన యాకయ్యను నెక్కొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందాడు. అప్పటివరకు తమతో ఉన్న యాకయ్య తిరిగిరాని లోకానికి వెళ్లడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగింది. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు స్నేహ, రుచిత ఉన్నారు. వేడుకల్లో పాల్గొన్న యాకయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


యాకయ్య మృతదేహం

# లాఠీ వదిలి.. చాక్‌పీస్ పట్టి..

- టీచర్ ఉద్యోగం సాధించిన మహిళా కానిస్టేబుల్

కాటారం, అక్టోబరు 10: ఇన్నాళ్లుగా లాఠీ చేతబట్టి శాంతిభద్రతల విధులు నిర్వర్తించిన మహిళా కానిస్టేబుల్‌కు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. కాటారం పోలీస్‌స్టేషన్‌లో డబ్ల్యూపీసీగా పనిచేస్తున్న జగిత్యాల జిల్లాకు చెందిన గడిపెల్లి తేజశ్రీ ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా ఎంపికైంది. 2020 బ్యాచ్‌లో డబ్ల్యూపీసీగా ఎంపికై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ 317 జీవోలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు కేటాయింపు పొందిన ఆమెకాటారం పీఎస్‌లో చేరింది. సుదూర ప్రాంతంలో పోలీస్ ఉద్యోగం చేస్తూనే సొంత మండలంలోనే ఉద్యో గం చేయాలని సంకల్పించి పట్టుదల, క్రమశిక్షణతో డీఎస్సీకి సిద్ధమైంది. 65వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికైంది. టీచర్ ఉద్యోగం సాధించిన తేజశ్రీని పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.


తేజశ్రీ

# నేడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన

ములుగు, అక్టోబరు 10: బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాతో విద్యను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాలకు మొదటి విడతలో ఈ స్కూళ్లను మంజూరు చేయగా అందులో ములుగు ఒకటి. ములుగు మండలం ఇంచర్ల పంచాయతీ పరిధి సర్వే నంబర్ 17లోని హార్టికల్చర్ నర్సరీకి చెందిన 20 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ దివాకర ఇప్పటికే కేటాయించారు. గురువారం సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌తో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో స్కూల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు.

# గోదావరిలో మునిగి మత్స్యకారుడి మృతి

మహదేవపూర్, అక్టోబరు 10 : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గోదావరిలో నీటమునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని పలుగులలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పసుల మల్లయ్య(48) బుధవారం చేపలు పట్టేందుకు గోదావరి వద్దకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో బంధువులు, కుటుంబసభ్యులు గోదావరి తీర ప్రాంతంలో వెతకగా గురువారం మల్లయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య అమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.


మల్లయ్య మృతదేహం

# రతన్‌టాటా సేవలు మరువలేనివి

- ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, అక్టోబరు 10 : వ్యాపార రంగంలో రాణిస్తూనే పేద వర్గాలకు రతన్ టాటా సేవలన్ని మరువలేనివని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య కొనియాడారు. గురువారం కేయూ హాస్టల్ ఆఫీస్‌లో రతన్ టాటా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రతన్ టాటా వ్యాపారంలో వచ్చిన లాభాల్లో 60 శాతం జాతీయం చేశారని వివరించారు. యువత రతన్‌టాటాను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. భారతీయుల గుండెల్లో చెరగాని ముద్రవేసిన గొప్ప వ్యాపారవేత్త-నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శంగా రతన్ టాటా నిలుచారని కొనియాడారు.

దేశం సంకట స్థితిలో ఉన్న సమయంలో రతన్ టాటా అపన్న హస్తం అందించారని గాదె సమ్మయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్‌కు కృషి చేస్తా

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గౌడ వృత్తిదారులకు కాటమయ్య రక్షా కిట్‌లను రాజేందర్‌రెడ్డి అందచేశారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

## పండుగ పూట ప్రయాణికులపై ఆర్టీసీ బాదుడు

### స్పెషల్ బస్సుల పేరుతో అదనపు చార్జీల వసూలు

బాలసముద్రం, అక్టోబరు 10 : వరంగల్ రీజనల్ పరిధిలోని ప్రయాణికులపై పండుగ పూట ఆర్టీసీ చార్జీలు పెంచి అదనంగా వసూళ్లు చేసింది. బతుకమ్మ, దసరా పండుగలకు హైదరాబాద్ నుంచి సొంతూర్లకు వస్తున్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వరంగల్ రీజనల్ పరిధిలో ఈనెల 1 నుంచి వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సుల్లో ప్రయాణించిన వారికి సుమారు 30 నుంచి 50శాతం వరకు సాధారణ చార్జీలకు అదనంగా టికెట్ ధర పెంచిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ రద్దీ సమయంలో హనుమకొండ నుంచి స్పెషల్ బస్సులు ఖాళీగా వెళ్లి ప్రయాణికులను తీసుకువస్తున్నందున అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పండుగ పూట అదనపు వసూళ్లు చేయడంపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై మండిపడుతున్నారు.

## బండి సంజయ్‌ని కలిసిన మాలధారులు

న్యూశాయంపేట, అక్టోబరు 10: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ న్యూశాయంపేటకు చెందిన బీజేపీ నాయకులు భవాని దీక్ష మాలలో గురువారం కరీంనగర్‌లో కలిశారు. బీజేపీ నాయకులకు బండి సంజయ్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పెరుగు సురేష్, వేల్పుల భిక్షపతి, కోరుకొప్పుల రాజేష్ ఖన్నా, చంద్రపాల్, శోభన్, గణేష్, సంపత్ పాల్గొన్నారు.

## హనుమకొండ ట్రాఫిక్ సీఐగా సీతారెడ్డి బాధ్యతల స్వీకరణ



హనుమకొండ టౌన్, అక్టోబరు 10 : హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా సీతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎండి.షూకూర్ బదిలీపై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా అతడి స్థానంలో సీతారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. కాగా సీతారెడ్డి హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వర్తించడం రెండవసారి. షూకూర్‌కు ముందు కొంత కాలం హనుమకొండ ట్రాఫిక్ సీఐగా సీతారెడ్డి పనిచేశారు. తాజాగా షూకూర్ బదిలీ కావడంతో తిరిగి రెండవసారి హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐగా పోస్టింగ్ దక్కించుకున్నారు. 10నెలల కాలంలోనే తిరిగి రెండవసారి అదే పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పోస్టింగ్ ఇవ్వడంపై పోలీస్‌శాఖపై సర్వత్ర పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

## దుర్గాదేవి అలంకరణలో రుద్రేశ్వరీ

### గజవాహనంపై అమ్మవారి ఊరేగింపు

### ఆలయాన్ని సందర్శించిన గోవిందానంద స్వామి



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న గోవిందానంద స్వామి

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎనిమిదవ రోజు రుద్రేశ్వరీ దేవికి శంకుపూజ, శ్రీ చక్రార్చన, చతుశష్ఠి ఉపచార పూజలు నిర్వహించారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. మందార పూలతో పూజించారు. అమ్మవారిని గజవాహనంపై ఊరేగించారు. నిత్యచండీ హోమం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాహితీ కళావికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీతం కచేరి ఆహూతులను ఆకట్టుకున్నది. ప్రముఖ అధ్యాత్మిక గురువు హంపీ విరూపాక్ష సంస్థాన ప్రవచకులు శ్రీ గోవిందానంద స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగ ఉపేంద్ర శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉత్తిష్ఠ గణపతిని దర్శనం చేసుకున్న అనంతరం రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రేశ్వరీ దేవి దర్శనం చేసుకున్నారు. అనంతం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ చతుర్మాస దీక్ష తర్వాత కాశీ నుండి సాగిస్తున్న యాత్రలో భాగంగా వరంగల్‌కు వచ్చినట్టు చెప్పారు. సనాతన ధర్మపరిరక్షణకు ప్రతీ ఒక్కరు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ముందుగా గురువందనం నిర్వహించారు.

# గంగమ్మ చెంతకు గౌరమ్మ

### అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

### ఉయ్యాల పాటలతో మార్మోగిన ఆలయాలు



గోపాల్‌పూర్ బృందావన కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మడికొండలో బురుజు వద్ద..



చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద జరిగిన సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి



న్యూశాయంపేటలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

వడ్డెపల్లి, అక్టోబరు 10 : హనుమకొండలోని వివిధ డివిజన్లలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. గురువారం బతుకమ్మలతో మహిళలు ఆలయాలు, కాలనీల కూడలి ప్రాంతాలతో పాటు చెరువుల వద్దకు తరలి వెళ్లి బతుకమ్మలను కొలిచి ఆడి పాడారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని బృందావన కాలనీలో రచ్చ పద్మ, జక్కుల నిర్మల, అంచూరి కవిత, సువర్ణ తదితరుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను భక్తిప్రపత్తులతో ఆడి వాయినాలను పంచుకున్నారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ వేంకటేశ్వర దేవాలయానికి మండల సంధ్య ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలతో తరలి వెళ్లి బతుకమ్మలను ఆడి పాడారు. వడ్డెపల్లి సీతారామాంజనేయ స్వామి ఆలయం, టీచర్స్‌కాలనీ ఫేస్ -1 కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అధ్యక్షుడు చిర్ర రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. వడ్డెపల్లి శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించుకున్నారు.

గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గోకుల్ నగర్ పోచమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధి మూగల కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు అంబరాన్నంటాయి.



హనుమకొండ రెడ్డికాలనీలో బతుకమ్మలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

● ధర్మసాగర్ : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మహిళలు చెరువులు, కుంటల వద్దకు చేరుకొని బతుకమ్మలను కొలిచి ఆడిపాడారు. డీజే పాటలకు యువతులు నృత్యం చేశారు. అనంతరం పోయిరా బతుకమ్మ అంటూ గంగమ్మ చెంతకు గౌరమ్మలను సాగనంపారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు రాజు, నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. బతుకమ్మ ఆడే సమయంలో వర్షం పడడంతో మహిళలు కాస్తా ఇబ్బందిపడ్డారు.

● వేలేరు : వేలేరు, పీచర, మల్లికుదుర్ల గ్రామాల తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వరు పాల్గొన్నారు.

● మడికొండ : మడికొండ మెట్టుగుట్ట, బురుజు వద్ద మహిళలంతా ఒక్క చోట చేరి ఉత్సాహంగా బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. 64వ డివిజన్ టేకులగూడెం, ఉనికిచర్ల, 46వ డివిజన్ రాంపూర్, 45వ డివిజన్ కడిపికొండ, అయోధ్యాపురం, తరాలపల్లి, కుమ్మరిగూడెం గ్రామాల్లో మహిళలు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజబాబు, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

● బాలసముద్రం: సద్దుల బతుకమ్మ వేడుకలు బాలసముద్రంలో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం సాయంత్రం వర్షం కురవడంతో మహిళలు బతుకమ్మ వేడుకలను ఆలస్యంగా జరుపుకున్నారు. వర్షం తగ్గడంతో వేడుకలను మహిళలు అభయాంజనేయ స్వామి దేవాలయం, పద్మాక్షి గుట్ట, శ్రీనివాస నగర్ కాలనీ, అడ్వకేట్స్ కాలనీ మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకొని బతుకమ్మలను నిమజ్జనం చేశారు

● కాజీపేట : కాజీపేట వంద ఫీట్లరోడ్, ట్యాంక్ బండ్ సమీపంలో చిరు జల్లుల మధ్య ఘనంగా జరిగాయి. గురువారం సాయంత్రం ఆరుగంటల సమయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ సమీపంకు చేరి బతుకమ్మలు ఆడుతుండగా వర్షం పడింది. అరగంటసేపు వేడుకలకు అంతరాయం కలిగింది. వర్షం పూర్తికాకుండా చిరుజల్లులు కురుస్తుండగానే మహిళలంతా ఒక చోట చేరి బతుకమ్మలు ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు.

మహిళలు ట్యాంక్ బండ్ నుంచి ఫాతిమా జంక్షన్ వరకు బతుకమ్మలు పేర్చి, ఆటలాడుతూ.. పాటలు పాడారు. వేలాదిగా వచ్చిన మహిళలతో ట్యాంక్ బండ్, సిద్ధార్థనగర్, ఫాతిమా జంక్షన్ ప్రాంతాలు కిక్కిరిసి పోయింది. బ్రిడ్జి, ఫాతిమా జంక్షన్ వద్ద గంటలకొద్ది ట్రాఫిక్ జామ్ అయ్యింది. కాజీపేట డీజిల్ కాలనీ, సోమిడి, విష్ణుపురి, రైల్వే కాలనీ దేవాలయం, దర్గా, బంధం చెరువు సమీపంలో బతుకమ్మలు ఆడే మహిళలతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం జరుగకుండా ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

● ఐనవోలు : ఊరూ వాడా కదిలి ఆడింది పాడింది. బతుకమ్మ పూల సంబరం నవజీవనానికి సంకేతకంగా మారింది. పూల జాతరగా రంగుల హరివిల్లుగా ఉయ్యాల ఊగే పాటల పల్లవులతో ఆడపడుచులు చప్పట్లు కొడుతూ ఆడిపాడారు. చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐనవోలు ఊర చెరువు వద్ద బతుకమ్మ సంబరాల్లో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ గ్రామాల్లో బందోబస్తును పర్యవేక్షించారు.

హనుమకొండ : హనుమకొండ పరిమళకాలనీ సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం కాలనీలోని సిగ్నేచర్ ప్లేస్ అపార్టుమెంట్ ఆవరణలో బతుకమ్మలన్నిటిని ఒక దగ్గర చేర్చి వాటి చుట్టూ వలయాకారంలో తిరుగుతూ చప్పట్ల మధ్య పాటలు పాడారు. కోలాటం ఆడారు. అనంతరం వడ్డెపెల్లి చెరువులో బతుమక్మలను నిమజ్జనం చేశారు.

హనుమకొండ పోచమ్మకుంట సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. సీతారామ యశోద నిలయం అపార్టుమెంట్‌లో మహిళలంతా చేరి బతుకమ్మలను ఒక దగ్గర చేర్చివాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడి, కోలాటం ఆడి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను హనుమకొండ పద్మాక్షిగుండంలో నిమజ్జనం చేశారు.

● హసన్‌పర్తి : తెలంగాణ సంస్కృతికి తలమానికం బతుకమ్మ పండుగ అని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమైన బతుకమ్మ వేడుకలు ప్రపంచంలో మంచి గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో ఏకశిల విద్యా సంస్థల సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.



హనుమకొండ శ్రీజ అపార్టుమెంట్‌లో..



సిగ్నేచర్ ప్లేస్ అపార్టుమెంట్‌లో ..



సీతారామ యశోద నిలయం అపార్టుమెంట్‌లో..



వేడుకల్లో ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి



కాజీపేట ట్యాంక్‌బండ్ సమీపంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో చిన్నారి

## ఇందిరా మహిళాశక్తి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 : ఇందిరా మహిళాశక్తి లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరి దానకిశోర్ అన్నారు. గురువారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సీడీఎంఏ వీపీ గౌతమ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ బల్దియా కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు, నిర్వాహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అడిగి తెలుసుకున్నారు. దానకిశోర్ అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వరంగల్ నగర పరిధిలో 215 స్వయం సహాయక గ్రూపులతో కలిపి 42 యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. 1318 వ్యక్తిగత యూనిట్ల లక్ష్యంగా ఇప్పటి వరకు 409 గ్రూపులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎల్ఆర్ఎస్ కోసం సుమారు లక్ష వరకు దరఖాస్తులు రావడం జరిగిందని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో లక్ష్యాన్ని చేరుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్, డీసీపీ ప్రసన్నరాణి, టీపీఎస్‌లు శ్రీకాంత్, ఇర్షాద్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అధికారులు

## చెస్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 10 : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి అండర్-15 బాలబాలికల చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. ఈ మేరకు తెలంగాణ చెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్. రవీందర్ గురువారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీల కరపత్రాలను క్రీడా పోటీల నిర్వహకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ...1 ఇక్కడ రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను నవంబర్ నెల చివరి వారంలో తమిళనాడులో నిర్వహించనున్న జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి చెస్ ఆర్బిటర్లు చంద్రమౌళి, శ్రీరాం, అర్బిటర్స్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## 'దళితులకు మత స్వేచ్ఛను కల్పించాలి'

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : దళితులకు మత స్వేచ్ఛను కల్పించడమే కాకుండా ఉద్యోగ నియామకాలు, విద్య, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం పెంచాలని విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ కే బాబురావు పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో రిలీజియస్ ఫ్రీడమ్ ఫర్ దళిత్స్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాబురావు మాట్లాడారు. నేటికి దళితులకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గం, అధికారిక తప్పిదాల కారణంగా దళితుల హక్కులకు భంగం ఏర్పడిందన్నారు. ఈ లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం జస్టిస్ బాలక్రిష్ణన్ కమిషన్ నవంబరులో జరిపే అధ్యాయనంలో దళిత క్రైస్తవుల నుంచి అభిప్రాయాలను సేకరించనుందని తెలిపారు. సమావేశంలో యునైటెడ్ క్రిస్టియన్ కాలేజ్ ప్రిన్సిపాల్ వసంతరావు, విద్యావేత్త పరంజ్యోతి, బిషప్‌సింగం, పులుగుజ్జు సురేశ్, అరుణ జ్యోతి, ప్రొఫెసర్ థామస్, మాజీ కార్పొరేటర్లు డిన్నా, ఫ్రాంక్లిన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోయిరా బతుకమ్మా.. పోయిరావమ్మా..

(7వ పేజీ తరువాయి)

వరంగల్‌లోని పోతననగర్, కొత్తవాడలోని తోటమైదానం, ఓసిటీలోని క్లబ్ హౌజ్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. హనుమకొండ పద్మాక్షిగుండం, వడ్డెపెల్లి చెరువు కట్ట, కాజీపేటలోని బంధం చెరువు, సోమిడిలోని ఊరచెరువు, హసన్‌పర్తిలోని పెద్ద చెరువు, బీమారంలోని ఊరచెరువు, రైల్వే కాలనీలోని ఆలయాల ప్రాంగణం, మడికొండలోని మెట్టుగుట్ట కింద, ధర్మసాగర్ చెరువు కట్ట, కడిపికొండ చెరువు తదితర చోట్ల సద్దుల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఇక భీమదేవరపల్లి మండలంలో ముల్కనూరు బతుకమ్మ బండ, కొత్తకొండ వీరభద్రస్వామి ఆల య ప్రాంగణం, వంగరలోని ఊరచెరువు, గట్టునర్సింగాపూర్ చెరువు, రత్నగిరి చెరువు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద, కమలాపూర్ మండలం కేంద్రంలోని పెద్ద చెరువు, ఉప్పల్, శనిగరం, శాయంపేట మం డలం కేంద్రంలోని తాళ్లకుంట, పరకాల పట్టణంలో పశువుల సంత, సీతారాంపురంలోని నల్ల చెరువు, దామెర చెరువు, ఆత్మకూరు మండలంలో కటాక్షపూర్, దామెర మండలాల్లోని చెరువులు, అయినవోలు ఆలయ ప్రాంగణంలో సంబరాలు అంబరాన్నంటాయి.

### నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు

బతుకమ్మల నిమజ్జన ప్రాంతాల్లో యంత్రాంగాలు పటిష్ఠ ఏర్పాట్లు చేశాయి. ఉర్సు రంగ సముద్రం, దేశాయిపేట చిన్నవడ్డెపెల్లి చెరువు, పోతన నగర్ భద్రకాళి చెరువు కట్ట, వడ్డెపెల్లి చెరువు కట్ట, హనుమకొండ పద్మాక్షి గుండం తదితర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ విస్తృత ఏర్పా ట్లు చేసింది. నిమజ్జన స్థలాల వద్ద విద్యుత్‌దీపాలఏర్పాటు తాగునీటి వసతి కల్పించారు.

### వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమారెడ్డి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తోటి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. హనుమకొండ పద్మాక్షి గుండం వద్ద జరిగిన వేడుకలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు.

### వర్షంతో అంతరాయం

సద్దుల బతుకమ్మ వేడుకలకు వర్షం కొంత అంతరాయం కలిగింది. సాయంత్రం సద్దుల బతుకమ్మలను తీసుకొని చెరువులు, మైదాన ప్రాంతాలకు చేరుకున్న కొద్ది సేపటికే వర్షం కురవడం మొదలైంది. ఒక మోస్తరు చిరుజల్లులు కురిశాయి. దీంతో మహిళలు, వారి వెంట వచ్చిన పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. మహిళలు ఆ జల్లుల్లో తడుస్తూనే బతుకమ్మ ఆటలు ఆడారు.

# దసరా జోష్

### మద్యం, మాంసానికి డిమాండ్

### పెరిగిన లిక్కర్ విక్రయాలు

### మేకలు, గొర్రెల ధరలకు రెక్కలు

వరంగల్ క్రైం, అక్టోబరు 10 : దసరా అంటేనే మందు, మాంసం. ముక్క, చుక్క లేని దసరాను ఊహించలేం. ఉన్నవాడు, లేనివాడు అనే తేడా లేకుండా ప్రతీ కుటుంబం దసరాను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఏ పండు గలకు లేని జోష్ దసరా పండుగ వేళ కనిపిస్తూఉంటుంది. శనివారం దసరా పండుగను పురస్కరించుకుని వారం రో జుల ముందు నుంచే జిల్లా ప్రజలు ఏర్పాట్లు చేసు కుంటున్నారు. ఓ వైపు దుస్తులు, ఇతర వస్తువుల షాపింగ్ కోసం నగరానికి వస్తున్న జనాలతో మార్కెట్ సందడిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్, హనుమకొండలోని ప్రధాన సెంటర్లు కిటకిట లాడుతున్నాయి.

### దసరాకు రెడీ అవుతున్న జనాలు

శనివారం దసరా సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్న వారితో ఇళ్లలో సందడి కనిపి స్తుండగా.. మద్యం, మాంసం ప్రియులు ఆదిశగా ముం దస్తు ఏర్పాట్లు చేసుకుంటుండటంతో లిక్కర్, మాంసం వ్యాపారం కూడా జోష్ అందుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో కోరుకున్న బ్రాండ్‌లు అందుబాటులో ఉండకపో తుండటంతో నగరంలోని వైన్ షాపులు, లిక్కర్ మార్ట్‌ల నుంచి ప్రముఖ బ్రాండ్ల మద్యం కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు శనివారం మద్యం కృత్రిమ కొరత సృష్టించడం, ధరలను పెంచే అవకాశం ఉం టుందనే ఆలోచనతో రెండురోజుల ముందుగానే తీసుకెళుతున్నారు. ప్రస్తుతం లైట్, స్ట్రాంగ్ బీర్లు, మద్యం ఫుల్ బా టిళ్ల బ్రాండ్లను బట్టి ధరలుంటాయి. ఈ ధరలను ఏ మా త్రం లెక్కచేయని మద్యం ప్రియులు దసరాను ఘనంగా జరుపుకొనేందుకు కావాల్సినంత మద్యం కొనుగోలు చేస్తున్నారు. రెండు రోజులుగా నగరంలో మద్యం షాపులు కిటకిట లాడుతున్నాయి. రోజుకు రూ.2లక్షల కౌంటర్ ఉం డే షాపుల విక్రయాలు రెండు రోజులుగా రెట్టింపైనట్టు తెలిసింది. నగరం నుంచి ఊర్లకు వెళ్లే ప్రతీ వాహనంలో మద్యం కాటన్లు దర్శనమిస్తుండటం విశేషం.



### మాంసానికి అడ్వాన్స్ బుకింగ్స్..

మాంసం విషయానికి వస్తే ప్రస్తుతం కిలో మటన్ రూ.850 ఉండగా ఈ ధర దసరా రోజున పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో చాలామంది మటన్ షాపుల వా రికి అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. ప్రతీ ఒక్కరు రెండు కిలోలకు పైగానే కొనుగోలు చేస్తున్నట్టు నగరంలోని ఒక మటన్ షాపు యజమాని తెలిపారు. దీంతో పాటు వివిధ రకాల సం ఘాల సభ్యులు, అపార్ట్‌మెంట్లు, పలు సంస్థల్లో పనిచే సేవారు, స్నేహితులు గ్రూపులుగా ఏర్పడి మటన్ కోసం మేకపోతులు, గొర్రెపోతులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా ముల్కనూరు, భీమదే వరపల్లి, పరకాల, జమ్మికుంట అంగళ్లలో కొనుగోలు దారు ల రద్దీ కనిపిస్తోంది. ఈ క్రమంలో మేకపోతులు, గొర్రెపోతుల ధరలు పెరిగినప్పటికీ లెక్కచేయడం లేదని, తామే స్వయంగా మంచి మాంసం సిద్ధం చేసుకోవచ్చన్న ఆలోచనతో ధర ఎక్కువగా జీవాలను కొనుక్కునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 10కేజీల మాంసం వచ్చే మేకపోతు ధర పదిరోజుల ముందు రూ.8వేలుంటే రెండు రోజులుగా ఈ ధర రూ.10వేలకు పైగా అయినట్లు చెబుతున్నారు. శనివారం నాటికి ఈ ధర రెట్టింపయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA RURAL శుక్రవారం 11 అక్టోబరు 2024

# హనుమకొండ రూరల్

• పరకాల • నడికూడ • ఆత్మకూరు • దామెర • శాయంపేట • ఎల్కతుర్తి • భీమదేవరపల్లి • కమలాపూర్

## దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



దామెర : మండల కేంద్రంలోని దామేశ్వర ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి నాగిళ్ల రాజుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. శివం టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి ఎనిమిదో రోజు అమ్మవారికి పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించారు. పూజలో మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, పోలం కృపాకర్‌రెడ్డి, మేరుగు మల్లయ్య, కుమార స్వామి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పండుగ పూట ప్రయాణికులపై ఆర్టీసీ బాదుడు

### స్పెషల్ బస్సుల పేరుతో అదనపు చార్జీ వసూలు

బాలసముద్రం, అక్టోబరు 10 : వరంగల్ రీజనల్ పరిధిలోని ప్రయాణికులపై పండుగ పూట ఆర్టీసీ చార్జీలు పెంచి అదనంగా వసూళ్లు చేసింది. బతుకమ్మ, దసరా పండుగలకు హైదరాబాద్ నుంచి సొంతూర్లకు వస్తున్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వరంగల్ రీజనల్ పరిధిలో ఈనెల 1 నుంచి వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సుల్లో ప్రయాణించిన వారికి సుమారు 30 నుంచి 50శాతం వరకు సాధారణ చార్జీలకు అదనంగా టికెట్ ధర పెంచిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ రద్దీ సమయంలో హనుమకొండ నుంచి స్పెషల్ బస్సులు ఖాళీగా వెళ్లి ప్రయాణికులను తీసుకువస్తున్నందున అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పండుగ పూట అదనపు వసూళ్లు చేయడంపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై మండిపడుతున్నారు.

## గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్‌కు కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గౌడ వృత్తిదారులకు కాటమయ్య రక్షాకిట్‌లను రాజేందర్‌రెడ్డి అందజేశారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు మత స్వేచ్ఛ కల్పించాలి

### విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ కే బాబురావు

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : దళితులకు మత స్వేచ్ఛను కల్పించడమే కాకుండా ఉద్యోగ నియామకాలు, విద్య, రాజకీయ రంగాల్లో ప్రాతినిథ్యం పెంచాలని విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ కే బాబురావు పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో రిలీజియస్ ఫ్రీడమ్ ఫర్ దళిత్స్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాబురావు మాట్లాడారు. నేటికి దళితులకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకవర్గం, అధికారిక తప్పిదాల కారణంగా దళితుల హక్కులకు భంగం ఏర్పడిందన్నారు. ఈ లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం జస్టిస్ బాలక్రిష్ణన్ కమిషన్ నవంబరులో జరిపే అధ్యయనంలో దళిత క్రైస్తవుల నుంచి అభిప్రాయాలను సేకరించనుందని తెలిపారు. సమావేశంలో యునైటెడ్ క్రిస్టియన్ కాలేజ్ ప్రిన్సిపాల్ వసంతరావు, విద్యావేత్త పరంజ్యోతి, బిషప్‌సింగం, పులుగుజ్జు సురేశ్, అరుణ జ్యోతి, ప్రొఫెసర్ థామస్, మాజీ కార్పొరేటర్లు డిన్నా, ఫ్రాంక్లిన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పరకాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆత్మకూరులో..





ముల్కనూరులో..

# పోయి రావమ్మా.. బంగారు బతుకమ్మ

**» ఊరూరా ఘనంగా వేడుకలు » ఆడిపాడిన మహిళలు » ఆడపడచులతో సందడిగా మారిన గ్రామాలు**

పరకాల, అక్టోబరు 10 : సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పరకాల నియోజకవర్గంలోని సంగెం, ఆత్మకూరు, గీసుకొండ, దామెర, పరకాల, నడికూడ మండలాల్లో, పరకాల మునిసిపాలిటీలో గురువారం సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తలస్నానాలు చేసి వాకిళ్లలో కల్లాపి చల్లి ఇండ్లను శుభ్రం చేసుకొని పిండి వంటకాలను చేసుకున్నారు. ఇంటి మహాలక్ష్మీలు నూతన వస్త్రాలను ధరించి గ్రామాల శివారులోని చెరువులు, కుంటలు, దేవాలయాల వద్ద బతుకమ్మ ఆడి పాడారు. పరకాల విలీన గ్రామాలతో పాటు పరకాలలో ప్రధాన రోడ్ల వెంట రంగురంగుల వీధిదీపాలతో పురపాలక సంఘం అధికారులు అలంకరించారు. పట్టణంలోని పశువుల సంతలో రెండు రోజుల పాటు ట్రాక్టర్లతో చదును చేసి మొరంతో గుంతలను పూడ్చారు. ప్రతి ఇంటి నుంచి బతుకమ్మలతో మహిళలు తరలివచ్చి ఆహ్లాద వాతావరణంలో బతుకమ్మ ఆడారు. డీజే సౌండ్‌తో పాటు మిరుమిట్లు గొలిపే లైట్ల వెలుగులతో పశువుల సంత సందడిగా మారింది. డీజే పాటలకు అనుగుణంగా మహిళలు కోలాటమాడారు. సాయంత్రం 4గంటల నుంచి మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి గుంపులుగా ఏర్పడి బతుకమ్మలను మధ్యలో పెట్టి ఆటలు ఆడుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాత్రి 11గంటల వరకు సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు సంతోషంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ చైర్ పర్సన్ సోదా అనిత, కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, దేవునూరి రమ్యకృష్ణ, పసుల లవణ్య, చందుపట్ల సుజాత, శనిగిరపు రజిని, నల్లేల జ్యోతి, గొర్రె స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

**వర్షంతో ఇబ్బందిపడిన మహిళలు**

గురువారం రాత్రి బతుకమ్మ ఆడే సమయంతో ఒక్కసారిగా వర్షం పడడంతో మహిళలు ఇండ్లకు పరుగులు తీశారు. మరి కొందరు వర్షంలోనే ఆడారు. పట్టణంలోని పశువుల సంతలో వేల సంఖ్యల్లో పాల్గొన్న మహిళలు వర్షం రాకతో క్షణంలో ఆట స్థలం ఖాళీ అయ్యింది.

**నడికూడలో..**

నడికూడ : మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు బతుకమ్మ ఆడ డానికి జీపీ సిబ్బంది మైదానాలను శుభ్రం చేసి, లైటింగ్ ఏర్పాటు చేశా రు. మహిళలు పిల్లలు కొత్త దుస్తులు ధరించి గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చారు. ఊరంతా ఒక్క చోటకు చేరి ఆట పాటలతో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుక మ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. మహిళలు పిండి వంటలను బంధువులు, స్నేహితులకు వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.

**భీమదేవరపల్లిలో..**

భీమదేవరపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు గురువారం కనుల పండువగా జరిగాయి. బతుకమ్మ ఆడే ప్రాంతాలను ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బతుకమ్మ బండ వద్ద బాణసంచా కాల్చారు. మహిళలు ఆనందంగా ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సీఐ రమేష్, ఎస్ఐలు సాయిబాబు, దివ్య బందోబస్తు నిర్వహించారు. వర్షంతో కాస్తా అంతరాయం ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి రాజ్యలక్ష్మి-ప్రవీణ్‌రెడ్డి దంపతులు భీమదేవరపల్లిలో వేడుకల్లో పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పసుపుతో చేసిన గౌరమ్మను అలంకరించి ఆట పాటలతో మహిళలు ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. డీజే పాటలకు అనుగుణంగా నృత్యం చేశారు. ఆట స్థలంలో వర్షం నీరు నిలిచి మహిళలు కాస్త ఇబ్బందిపడ్డారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. బతుకమ్మ ప్రాంగణంలో ఎస్సై గోదారి రాజ్‌కుమార్ బందోబస్తును నిర్వహించారు.

**పోయిరావమ్మా.. గౌరమ్మ**

దామెర : మండల పరిధిలోని గ్రామాల్లో విస్తృత ఏర్పాట్ల మధ్య బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో పోచమ్మ దేవాలయం ఎదుట స్పెషల్ ఆఫీసర్ రంగాచారి, జీపీ సెక్రటరీ మనోహర్‌రెడ్డిల పర్యవేక్షణలో జీపీ కారోబార్ మాదారపు బొబ్బిలి, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మహిళలంతా తీరొక్క పూలను తీసుకొచ్చి అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక చోట పెట్టుకుని గుంపులు గుంపులుగా చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుకున్నారు. కొద్దిసేపు కురిసిన వర్షంతో కొంత సేపు మహిళలు ఇబ్బంది పడ్డారు. అనంతరం పోయిరావమ్మా.. బతుకమ్మ అంటూ.. ఆయా గ్రామాల్లోని చెరువుల్లో, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ వెలుగులు, డీజే వాయిద్యాల నడుమ నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఆడి పాడారు. గ్రామాల్లో కార్యదర్శుల పర్యవేక్షణలో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి.

**కమలాపూర్‌లో..**

కమలాపూర్ : మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద మహిళలు ఆనందరంగా బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా వర్షంలోనూ ఆడిపాడారు. వివిధ గ్రామాల వేడుకల్లో కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, నాయకులు తౌటం రవీందర్, గుండెపు చరణ్ పటేల్, బాలసాని రమేష్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బతుకమ్మ వేడుకల్లో కుడా చైర్మన్**

ఆత్మకూరు : మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, అవంతిరెడ్డి దంపతులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. పోచమ్మసెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత పూజ చేశారు. కుడా చైర్మన్‌తో పాటు ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు, కాంగ్రెస్ నాయకుడు గుండెబోయిన శ్యామ్, కాడబోయిన రవియాదవ్, తనుగుల సందీప్, మార్కెట్ డైరెక్టర్ కాడబోయిన రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుడెప్పాడ్‌లో బతుకమ్మ వేడుకల్లో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు బీరం రామకృష్ణారెడ్డి, కీసరి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శాయంపేటలో..**

శాయంపేట : మండల పరిధిలో గురువారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ క్రమంలో మహిళలు రంగురంగుపూలతో పేర్చిన బతుకమ్మలను ఎత్తుకుని బతుకమ్మ ఆటస్థలాలకు చేరుకుని, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం చెరువులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వేడుకలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రమోద్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.



ఎల్కతుర్తిలో..



నడికూడలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



పరకాలలో..



దామెరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వేడుకల్లో సెల్ఫీ తీసుకుంటున్న యువతులు

## దుర్గామాతను దర్శించుకున్న మంత్రి



ఎల్కతుర్తిలో దుర్గామాతను దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి, అక్టోబరు 10: మండల కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గామాతను గురువారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణానికి ఆటంకం కలుగకుండా ప్రకృతి ప్రసాదించిన పువ్వులతో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. పాత గ్రామపంచాయతీని యూత్ క్లబ్ భక్తజన కమిటీలకు కేటాయించాలని యువకులు మంత్రిని కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు సంతాజి, గోలి రాజేశ్వర్‌రావు, పైడిపల్లి కిరణ్, కిరణ్‌కుమార్, పాక రమేష్, దుర్గామాత కమిటీ సభ్యులు బొజ్జ శ్రీధర్, గోడిశాల శ్రీనివాస్, టింకు యాదవ్, చిట్టిగౌడ్, గోలి అఖిల్, అంబాల శ్రీకాంత్, గోడిశాల నరేష్ పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట, అక్టోబరు 10: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరుపేదల ఆరోగ్యానికి భరోసా అన్నారు. అలాగే మండలంలోని మైలారం, ప్రగతిసింగారం, గట్లకానిపర్తి గ్రామాలలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మైలారం గ్రామస్తుల కోరిక మేరకు బతుకమ్మ ఆడే స్థలంలో కాంక్రీట్ వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చల్లా చక్రపాణి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపెల్లి నందం, నాయకులు చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, ఏఎంసీ డైరక్టర్లు కుమార స్వామి, వెంకటరాజిరెడ్డి, నాయకులు ఏరుగొండ శంకర్, చింతల రవిపాల్, రాజేందర్, వరదరాజు, చిరంజీవి, మసికె కుమార్, చిట్టిరెడ్డి జంగారెడ్డి, రాజిరెడ్డి, హింగె భాస్కర్ పాల్గొన్నారు.



మైలారంలో బతుకమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**కాంగ్రెస్‌లో చేరికలు**

మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు బోనపెల్లి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. పీఏసీఎస్ డైరెక్టర్ ఎలమంచి జయపాల్‌రెడ్డి, నాయకులు బత్తిని కుమార్, సమ్మయ్య, ఆదిరెడ్డిలతో పాటు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని, ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళకు గాయాలు

నడికూడ, అక్టోబరు 10: మండల కేంద్రంలో గురువారం బైక్ ఢీకొని మహిళ గాయపడింది. స్థానికుల కథనం ప్రకారం.. బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్తున్న లింగంపల్లి సత్తెమ్మను గొల్లపల్లికి చెందిన బాలుడు బైక్‌తో ఢీ కొట్టాడు. మహిళ కాలుకి తీవ్రంగా గాయాలు కాగా, స్థానికులు ఆటోలో పరకాల ఆసుపత్రికి తరలించారు.

## తాగునీరు కలుషితం

### కొంగ బావిలో పడి మృతి చెందడం వల్లే!

నడికూడ, అక్టోబరు 10: మండల కేంద్రంలోని తాగునీటి బావిలో కొంగ పడి మృతి చెంది నీరు కలుషితమైంది. మండల స్పెషల్ ఆఫీసర్ చేతన్‌కుమార్‌రెడ్డి గురువారం జీపీ సిబ్బందితో కొంగను తీయించారు. బావిలో బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం నల్లాల నుంచి వచ్చే నీటిని ప్రజలు తాగొద్దని గ్రామస్తులను కోరారు. జీపీ సిబ్బంది అజాగ్రత్త వల్లనే ఇలా జరిగిందని పలువురు విమర్శిస్తున్నారు.

## ఇందిరా మహిళాశక్తి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 : ఇందిరా మహిళాశక్తి లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరి దానకిశోర్ అన్నారు. గురువారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సీడీఎంఏ వీపీ గౌతమ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ బల్దియా కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు, నిర్వాహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అడిగి తెలుసుకున్నారు. దానకిశోర్ అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వరంగల్ నగర పరిధిలో 215 స్వయం సహాయక గ్రూపులతో కలిపి 42 యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

1318 వ్యక్తిగత యూనిట్ల లక్ష్యంగా ఇప్పటి వరకు 409 గ్రూపులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎల్ఆర్ఎస్ కోసం సుమారు లక్ష వరకు దరఖాస్తులు రావడం జరిగిందని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో లక్ష్యాన్ని చేరుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, టీపీఆర్‌వో కోళ రాజేశ్ కుమార్, డీసీపీ ప్రసన్నరాణి, టీపీఎస్‌లు శ్రీకాంత్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోయిరా బతుకమ్మా.. పోయిరావమ్మా..

(7వ పేజీ తరువాయి)

వరంగల్‌లోని పోతననగర్, కొత్తవాడలోని తోటమైదానం, ఓసిటీలోని క్లబ్ హౌజ్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. హనుమకొండ పద్మాక్షిగుండం, వడ్డేపెల్లి చెరువు కట్ట, కాజీపేటలోని బంధం చెరువు, సోమిడిలోని ఊరచెరువు, హసన్‌పర్తిలోని పెద్ద చెరువు, బీమారంలోని ఊరచెరువు, రైల్వే కాలనీలోని ఆలయాల ప్రాంగణం, మడికొండలోని మెట్టుగుట్ట కింద, ధర్మసాగర్ చెరువు కట్ట, కడిపికొండ చెరువు తదితర చోట్ల సద్దుల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఇక భీమదేవరపల్లి మండలంలో ముల్కనూరు బతుకమ్మ బండ, కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణం, వంగరలోని ఊరచెరువు, గట్టునర్సింగాపూర్ చెరువు, రత్నగిరి చెరువు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద, కమలాపూర్ మండలం కేంద్రంలోని పెద్ద చెరువు, ఉప్పల్, శనిగరం, శాయంపేట మండలం కేంద్రంలోని తాళ్లకుంట, పరకాల పట్టణంలో పశువుల సంత, సీతారాంపురంలోని నల్ల చెరువు, దామెర చెరువు, ఆత్మకూరు మండలంలో కటాక్షపూర్, దామెర మండలాల్లోని చెరువులు, అయినవోలు మండలంలో మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణం తదితర చోట్ల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

**నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు**

బతుకమ్మల నిమజ్జన ప్రాంతాల్లో యంత్రాంగాలు పటిష్ఠ ఏర్పాట్లు చేశాయి. ఉర్సు రంగ సముద్రం, దేశాయిపేట చిన్నవడ్డెపెల్లి చెరువు, పోతన నగర్ భద్రకాళి చెరువు కట్ట, వడ్డెపెల్లి చెరువు కట్ట, హనుమకొండ పద్మాక్షి గుండం తదితర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసింది. నిమజ్జన స్థలాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టింది.

**వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు**

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి తదితరులు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తోటి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అలాగే వరంగల్ ఉర్సు రంగసముద్రం వద్ద జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొన్నారు. హనుమకొండ పద్మాక్షి గుండం వద్ద జరిగిన వేడుకలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. వారు ఈ సందర్భంగా మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

**వర్షంతో అంతరాయం**

సద్దుల బతుకమ్మ వేడుకలకు వర్షం కొంత అంతరాయం కలిగింది. సాయంత్రం సద్దుల బతుకమ్మలను తీసుకొని చెరువులు, మైదాన ప్రాంతాలకు చేరుకున్న కొద్దిసేపటికే వర్షం కురవడం మొదలైంది. ఒక మోస్తరు చిరుజల్లులు కురిశాయి. దీంతో మహిళలు, వారి వెంట వచ్చిన పిల్లలు, వృద్ధులు కొంత ఇబ్బందిపడ్డారు. అయినా మహిళలు ఆ జల్లుల్లో తడుస్తూనే బతుకమ్మ ఆటలు ఆడారు. వర్షంతో కొంత ఇబ్బందిపడ్డారు.